PRGI No. APTEL/2010/31893

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
జూన్ 19, 2026

AP & TG

సంపుటి : 16 (Vallume : 16)
| సంచిక : 15 (Issue: 15) |
పేజీలు : 4 (Pages : 4) |
వెల : రూ 2.00/-
(Rs : 2.00/-)



భార్య అక్రమ సంబంధం కేసులో భర్తకు అనుకూలంగా కోర్టు తీర్పు 2

# అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి



## సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల సమగ్ర విశ్లేషణ
ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసుకునే కొత్త వ్యవస్థ
జూలై నుంచి ప్రతి అధికారి ఫీల్డ్ విజిట్ తప్పనిసరి
దేవాదాయ శాఖ పనితీరు మెరుగుపరచాలని సీఎం ఆదేశం
డేటా ఆధారిత పాలనకు గూగుల్ సహకారం

అమరావతిలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. జూలై నుంచి ప్రతి అధికారి తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచేందుకు ఉద్యోగులపై 360 డిగ్రీల సమగ్ర విశ్లేషణ చేపడతామని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చి, అర్జీదారులే తమ ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేసుకునేలా కొత్త వ్యవస్థను తీసుకురానున్నట్లు వెల్లడించారు. డేటా ఆధారిత పాలనకు గూగుల్ సహకారంతో ముందుకు సాగుతున్నట్లు సీఎం పేర్కొన్నారు. దేవాదాయ శాఖ సహా అన్ని శాఖల్లో సేవల నాణ్యత పెంచాలని ఆయన ఆదేశించారు.

- కొత్తస్వరం న్యూస్, అమరావతి

2



## బంగ్లాదేశ్‌లో 81 అడుగుల శ్రీరాముడి విగ్రహ నిర్మాణానికి బ్రేక్

విగ్రహాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తామంటూ ఛాందసవాదుల హెచ్చరికలు
బెదిరింపులతో పనులు నిలిపివేసిన ఆలయ కమిటీ
హిందూ సంఘాల నిరసనలు, మైనారిటీల భద్రతపై ఆందోళన

2




2

## న్యాయమూర్తుల నియామకాల్లో మళ్లీ తెరపైకి స్థానికత అంశం

హైకోర్టు వద్ద ధర్నా చేసిన తెలంగాణ న్యాయవాదులు
స్థానికేతరుల పేర్లను పరిశీలించవద్దని ఏకగ్రీవ తీర్మానం
తెలంగాణ మూలాలున్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్
సుప్రీంకోర్టు, కొలీజియంకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం
విభజన తర్వాత మళ్లీ ఉత్కంఠ రేపుతున్న అంశం

## సచివాలయంలో 18వ ఎస్ఐపీబీ సమావేశం





పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం పరిశీలన
సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ
50కు పైగా ప్రాజెక్టులకు ఆమోదంపై కీలక చర్చ
ఇంధన, ఐటీ, పర్యాటక రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలు సమీక్ష
మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఉన్నతస్థాయి సమావేశం
మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేగం ఇచ్చే నిర్ణయాలు

2



## ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఆదేశాలు

మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్పీఎస్-2021 11 శాతం ఫిట్‌మెంట్ జూలై 1 నుంచి అమలు
బస్ డిపో, బస్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం
ఉద్యోగుల కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, ఉద్యోగ భరోసా
ఈవీ బస్సులు, కాలుష్య నియంత్రణపై దక్షిణాది సమావేశం ప్రణాళిక
ఆర్టీసీ పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహణ 2

# ఈ-కేబినెట్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అభివృద్ధి
ఉత్తరాఖండ్ మోడల్ ఆధారంగా తెలంగాణలో అమలు
ట్యాబ్‌లు, కంప్యూటర్ల ద్వారా క్యాబినెట్ ఫైళ్ల పరిశీలన
NICSI సహకారంతో డిజిటల్ వ్యవస్థ రూపకల్పన
పారదర్శక పాలనకు మరో కీలక అడుగు



**హైదరాబాద్, జూన్ 18 (కొత్త స్వరం):** తెలంగాణ ప్రభుత్వం క్యాబినెట్ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ-కేబినెట్ విధానానికి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అమలు ప్రక్రియ వేగవంతమైంది. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అమలులో ఉన్న ఈ-కేబినెట్ నమూనాను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మార్చి అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌కార్పొరేటెడ్ (NICSI)తో చర్చలు జరుగుతున్నాయి. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీడీటీఎస్)ను ఈ ప్రాజెక్టుకు నోడల్ ఏజెన్సీగా నియమించారు. ప్రారంభ దశలో రూ.20 లక్షల నిధులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విధానం అమలుతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు ట్యాబ్‌లు మరియు కంప్యూటర్ల ద్వారా ఎజెండాలు, ఫైళ్లను పరిశీలించగలుగుతారు. క్యాబినెట్ నోట్స్, ప్రతిపాదనలు, నిర్ణయాలు పూర్తిగా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండనున్నాయి. పాలనలో వేగం, పారదర్శకత, సౌలభ్యం పెంచడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. డేటా భద్రత కోసం ప్రత్యేక లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, అధునాతన సెక్యూరిటీ వ్యవస్థలను అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## ఉస్మానియా యూనివర్సిటీకి అరుదైన గౌరవం

దేశంలోనే తొలి వర్సిటీగా ఓయూ రికార్డు
ఒకేసారి నాలుగు ఐఎస్ఓ ధ్రువపత్రాలు సాధించిన దేశంలో తొలి విశ్వవిద్యాలయం
విద్య, పర్యావరణం, ఇంధనం, ఆహార భద్రతలో అంతర్జాతీయ గుర్తింపు
109 ఏళ్ల చరిత్రలో కీలక ఘట్టమన్న వీసీ ప్రొఫెసర్ కుమార్ 2

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు

'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష 2



## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు
అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ మనమిత్రలో ఫలితాలు
ఇంప్రూవ్‌మెంట్‌తో 1.83 లక్షల మందికి లబ్ధి
ఫెయిల్ అయిన లక్ష మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధన
విద్యార్థుల పట్టుదల ప్రశంసించిన మంత్రి నారా లోకేశ్
ఉన్నత విద్యకు మార్గం సుగమమైందని ప్రభుత్వం వెల్లడి

2

# అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

**సీఎం చంద్రబాబు స్పష్టీకరణ**

**ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల సమగ్ర విశ్లేషణ**

**ఫిర్యాదులను అర్జీదారులే ట్రాక్ చేసుకునే కొత్త వ్యవస్థ**

**జూలై నుంచి ప్రతి అధికారి ఫీల్డ్ విజిట్ తప్పనిసరి**

**దేవాదాయ శాఖ పనితీరు మెరుగుపరచాలని సీఎం ఆదేశం**

**డేటా ఆధారిత పాలనకు గూగుల్ సహకారం**

**అమరావతి, జూన్ 18 (కొత్త స్వరం):**

ప్రతి అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూలై నెల నుంచి అన్ని శాఖల అధికారులు ఫీల్డ్ విజిట్లు చేయాల్సిందేనని ఆయన ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పనితీరు మెరుగుపరచేందుకు అధికారులు, ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల సమగ్ర విశ్లేషణ చేపడతామని సీఎం తెలిపారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబడదని ఆయన హెచ్చరించారు. ప్రతి అధికారి వారానికి కనీసం మూడు రోజులు క్షేత్ర స్థాయిలో ఉండాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నెలలో నాలుగు సార్లు సందర్శించాలని, అలాగే నియోజకవర్గ నోడల్ అధికారులు ఒక మండలాన్ని నాలుగు సార్లు పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని ఆయన అన్నారు. దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దేవాలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల ఉద్యోగులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పరిపాలనలో సింగపూర్ విధానాలను అధ్యయనం చేసి అనుసరించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో గుర్తించిన రోడ్డు గుంతల్లో ఇప్పటికే 79 శాతం పూడ్చివేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన మరమ్మత్తులను వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా గూగుల్ సంస్థతో కలిసి పనిచేయడానికి అంగీకరించినట్లు సీఎం వెల్లడించారు. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే ఈ విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మిగిలిన శాఖల్లో కూడా ఈ వ్యవస్థను విస్తరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)ను మరింత పారదర్శకంగా మార్చి, అర్జీదారులే తమ ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలని సీఎం ఆదేశించారు.




# బంగ్లాదేశ్‌లో 81 అడుగుల శ్రీరాముడి విగ్రహ నిర్మాణానికి బ్రేక్

**విగ్రహాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తామంటూ ఛాందసవాదుల హెచ్చరికలు**

**బెదిరింపులతో పనులు నిలిపివేసిన ఆలయ కమిటీ**

**హిందూ సంఘాల నిరసనలు, మైనారిటీల భద్రతపై ఆందోళన**

**బంగ్లాదేశ్, జూన్ 18 (కొత్తస్వరం) :**

బంగ్లాదేశ్‌లో మత సామరస్యానికి భంగం కలిగించే ఘటన చోటుచేసుకుంది. దేశంలో అత్యంత ఎత్తైన శ్రీరాముడి విగ్రహంగా నిర్మిస్తున్న 81 అడుగుల విగ్రహ పనులు ఆకస్మికంగా నిలిచిపోయాయి. ఇస్లామిక్ ఛాందసవాద గ్రూపుల నుంచి తీవ్ర బెదిరింపులు రావడంతో ఆలయ కమిటీ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఘటనతో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర బంగ్లాదేశ్‌లోని గైబంధా జిల్లా, పలాశ్‌బరి ఉపజిల్లాలో ఉన్న శ్రీ శ్రీ రాధా గోవింద–కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. సుమారు 220 మిలియన్ టాకాల (దాదాపు రూ.15.6 కోట్లు) వ్యయంతో ఆలయ కమిటీ ప్రైవేటుగా ఈ పనులు చేపట్టింది. ఇప్పటికే 80 శాతం నిర్మాణం పూర్తయింది. అయితే ఇటీవల శుక్రవారం ప్రార్థనల అనంతరం కొందరు రాడికల్ గుంపులు ఆలయం వద్ద ఆందోళన చేస్తూ, శ్రీరాముడి చిత్రపటాలపై బూట్లు విసిరినట్లు సమాచారం. అంతేకాకుండా నిర్మాణంలో ఉన్న విగ్రహాన్ని బుల్డోజర్‌తో కూల్చివేస్తామని హెచ్చరికలు చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ బెదిరింపులతో ఆలయ నిర్వాహకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆలయ అధ్యక్షుడు హరిదాస్ చంద్ర దాస్ మాట్లాడుతూ, "మా భద్రతపై తీవ్రమైన ఆందోళన ఉంది. బెదిరింపుల కారణంగా పనులు కొనసాగించడం సాధ్యంకాలేదు. ప్రభుత్వం వెంటనే రక్షణ కల్పించి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి" అని కోరారు. ఆలయ సలహాదారు శ్యామ్‌లాల్ కుమార్ మహంత కూడా సామాజిక ఉద్రిక్తతలు పెరగకుండా తాత్కాలికంగా పనులు నిలిపివేశామని తెలిపారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ ఢాకా విశ్వవిద్యాలయానికి చెందిన హిందూ విద్యార్థులు జూన్ 16న కాగడాల ర్యాలీ నిర్వహించారు. బెదిరింపులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, విగ్రహ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. హిందూ సంఘాలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతూ మైనారిటీలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ ఈ ఘటనపై స్పందిస్తూ, తాలిబాన్లు బమియాన్ బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేసిన సంఘటనను గుర్తుచేశారు. మత అసహనాన్ని ప్రపంచం సహించకూడదని ఆమె వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ హిందూ బౌద్ధ క్రిస్టియన్ ఐక్య మండలి కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఉస్మానియా యూనివర్సిటీకి అరుదైన గౌరవం

**హైదరాబాద్, జూన్ 18 (కొత్తస్వరం) :**

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ దేశ ఉన్నత విద్యా రంగంలో చారిత్రాత్మక ఘనత సాధించింది. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి నాలుగు అంతర్జాతీయ ఐఎస్ఓ ధ్రువపత్రాలను పొందిన ఏకైక విశ్వ విద్యాలయంగా రికార్డు సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మక ధ్రువపత్రాలను భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) వర్సిటీకి అధికారికంగా అందజేసింది. విద్యాసంస్థల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ఇంధన సామర్థ్యం, ఆహార భద్రత వంటి నాలుగు కీలక రంగాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో బీఐఎస్ దక్షిణ ప్రాంత ఉపమహా డైరెక్టర్ సందీప్ కుమార్ కనోజియా ఈ సర్టిఫికెట్లను వీసీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘనత సాధించడం ప్రశంసనీయమని, అయితే ఈ ప్రమాణాలను కొనసాగించడమే అసలైన సవాల్ అని సూచించారు.

ఉస్మానియా యూనివర్సిటీకి లభించిన నాలుగు ధ్రువపత్రాలు ఇవి:

* విద్యా సంస్థల నిర్వహణ వ్యవస్థలకు సంబంధించిన అంతర్జాతీయ ప్రమాణ ధ్రువీకరణ
* పర్యావరణ నిర్వహణ వ్యవస్థలకు సంబంధించిన ధ్రువీకరణ
* ఇంధన నిర్వహణ వ్యవస్థలకు సంబంధించిన ధ్రువీకరణ
* ఆహార భద్రత నిర్వహణ వ్యవస్థలకు సంబంధించిన ధ్రువీకరణ

వీసీ ప్రొఫెసర్ కుమార్ మొళుగరమ్ మాట్లాడుతూ, 109 ఏళ్ల చరిత్రలో ఇది ఒక కీలక మైలురాయి అని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడం ద్వారా భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దిశగా యూనివర్సిటీ ముందుకు సాగుతోందని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయం ఇతర విద్యాసంస్థలకు ఒక ప్రమాణంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అంతర్గత నాణ్యత భరోసా విభాగం సహా అన్ని విభాగాల సమిష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందని ఆయన వివరించారు. విద్యా పరిపాలనతో పాటు పర్యావరణ హితం, ఇంధన పొదుపు, ఆహార భద్రత వంటి అంశాల్లో ఉస్మానియా యూనివర్సిటీ తన నిబద్ధతను ఈ అంతర్జాతీయ గుర్తింపుతో మరోసారి చాటుకుంది.

# సైకాలజిస్టుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక


జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు


జిల్లా కార్యదర్శి ఎం.ఆషా


వైస్ ప్రెసిడెంట్ జి.దుర్గాప్రసాద్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీని ప్రకటించిన ఏపీఏ ఇండియా**

**వివిధ హోదాల్లో నూతన కార్యవర్గ సభ్యుల నియామకం**

**సైకాలజీ రంగ అభివృద్ధికి విస్తృత కార్యక్రమాల ప్రణాళిక**

**రాజమండ్రి, జూన్ 18 (కొత్తస్వరం) :**

తెలుగు రాష్ట్రాల్లో సైకాలజీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న అడ్వాన్స్డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఏ ఇండియా) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీని ప్రకటించినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రమేష్ భావిశెట్టి తెలిపారు. ఈ మేరకు జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ ఎస్. సుదర్శిని రెడ్డి, జిల్లా అధ్యక్షులుగా సి.హెచ్. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా డి. దుర్గ ప్రసాద్, శ్రీను గిడ్లలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యదర్శిగా ఎం. ఆషా, కోశాధికారిగా చందు చైతన్య నియమితులయ్యారు. జాయింట్ కార్యదర్శులుగా వి.వి. రవికుమార్, బి. ప్రశాంత్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ వి. సుభాష్ రెడ్డి, ఎస్. వెంకటేష్, టి. విశ్వాని, కె. చిట్టి శ్రీవల్లి ఎంపికయ్యారు. జిల్లా ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్‌గా కేజేడి రవితేజను నియమించారు. 2009 నుంచి సైకాలజీ రంగంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, 2021లో అసోసియేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసినట్లు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణభరత్ తెలిపారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఎం. వరలక్ష్మి పేర్కొన్నారు. ఏపీఏ ఇండియా జాతీయ, రాష్ట్ర కమిటీల దిశానిర్దేశంలో జిల్లాలో సైకాలజీ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని జిల్లా కార్యదర్శి ఎం. ఆషా తెలిపారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ కార్యవర్గానికి జిల్లా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. రాజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఎం. రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నీరజ, రాష్ట్ర కోశాధికారి తేజ తోట తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు**

**అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ మనమిత్రలో ఫలితాలు**

**ఇంప్రూవ్‌మెంట్‌తో 1.83 లక్షల మందికి లబ్ది**

**ఫెయిల్ అయిన లక్ష మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధన**

**విద్యార్థుల పట్టుదల ప్రశంసించిన మంత్రి నారా లోకేశ్**

**ఉన్నత విద్యకు మార్గం సుగమమైందని ప్రభుత్వం వెల్లడి**

**అమరావతి, జూన్ 18 (కొత్త స్వరం):**

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్స్ (ఐపీఏఎస్ఈ)–2026 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ మనమిత్ర సేవ ద్వారా కూడా తెలుసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ద్వారా తమ ఫలితాలను మెరుగుపరుచుకున్న వారిని ఆయన అభినందించారు. వారి పట్టుదల, కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ద్వారా పెద్ద సంఖ్యలో విద్యార్థులు తమ మార్కులను మెరుగుపరుచుకున్నారని అధికారులు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 2,29,034 మంది విద్యార్థుల్లో 1,35,435 మంది (59 శాతం) మెరుగైన ఫలితాలు సాధించారు. అలాగే 1,09,003 మంది అభ్యర్థుల్లో 42,379 మంది (39 శాతం) ఉత్తీర్ణత సాధించి ఫలితాలను మెరుగుపరుచుకున్నారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 91,303 మంది విద్యార్థుల్లో 48,149 మంది (53 శాతం) మెరుగైన మార్కులు సాధించగా, మరో 1,02,018 మంది అభ్యర్థుల్లో 57,327 మంది (56 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశంతో మొత్తం 1.83 లక్షల మందికి పైగా విద్యార్థులు తమ మార్కులను మెరుగుపరుచుకున్నారని అధికారులు వెల్లడించారు. సాధారణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన దాదాపు లక్ష మంది విద్యార్థులు ఈ అవకాశంతో ఉత్తీర్ణులై ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలిగారని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు.

# సచివాలయంలో 18వ ఎస్ఐపీబీ సమావేశం

**పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం పరిశీలన**

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ**

**50కు పైగా ప్రాజెక్టులకు ఆమోదంపై కీలక చర్చ**

**ఇంధన, ఐటీ, పర్యాటక రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలు సమీక్ష**

**మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఉన్నతస్థాయి సమావేశం**

**మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేగం ఇచ్చే నిర్ణయాలు**

**అమరావతి, జూన్ 18 (కొత్త స్వరం):**

సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 18వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రోత్సాహం, పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా ఈ భేటీ నిర్వహించారు. ఇంధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, పెట్టుబడులు–మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు సంబంధించిన పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపే అంశాన్ని పరిశీలించారు. మొత్తం 50కు పైగా ప్రాజెక్టులకు ఆమోదం ఇచ్చే అవకాశంపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు పెంచడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# భార్య అక్రమ సంబంధం కేసులో భర్తకు అనుకూలంగా కోర్టు తీర్పు



**కేరళ, జూన్ 18 (కొత్తస్వరం):**

వైవాహిక వివాదంలో భర్తకు అనుకూలంగా కేరళలోని పతనంతిట్ట ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. భార్య చేసిన మోసం, వివాహేతర సంబంధం కారణంగా తన జీవితం నాశనమైందని భర్త కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో విచారణ జరిపిన కోర్టు భర్త వాదనలను సమర్థించింది. ఇది ఇద్దరికీ రెండో వివాహం కాగా, పెళ్లి తర్వాత కూడా భార్య వివాహేతర సంబంధాన్ని కొనసాగించినట్లు భర్త ఆరోపించాడు. అంతేకాకుండా, తనకు తెలియకుండా అబార్షన్ చేయించుకుని మోసం చేసిందని కూడా పేర్కొన్నాడు. 2018లో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, భార్య ప్రవర్తన వల్ల కుటుంబ జీవితం దెబ్బతిందని తేల్చింది. భార్యకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం. 2018 నుంచి ఇప్పటివరకు 6 శాతం వడ్డీతో చెల్లించాలని స్పష్టం. పెళ్లి సమయంలో ఇచ్చిన 32 గ్రాముల బంగారు ఆభరణాలు భర్తకు తిరిగి ఇవ్వాలని ఆదేశం. ఈ కేసులో భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, ప్రియుడు కూడా బాధ్యులని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పు వైవాహిక వివాదాల్లో చట్టపరమైన చర్చకు దారితీసేలా మారింది.

# ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఆదేశాలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఆర్పీఎస్-2021 11 శాతం ఫిట్‌మెంట్ జూలై 1 నుంచి అమలు**

**బస్ డిపో, బస్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**ఉద్యోగుల కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, ఉద్యోగ భరోసా**

**ఈవీ బస్సులు, కాలుష్య నియంత్రణపై దక్షిణాది సమావేశం ప్రణాళిక**

**ఆర్టీసీ పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహణ**



**హైదరాబాద్, జూన్ 18 (కొత్త స్వరం):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ నిర్ణయం ప్రకటించారు. ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్–2021 కింద 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని, మంజూరైన బస్ స్టేషన్‌లకు శంకుస్థాపనలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ములుగు, వేములవాడ, కథలాపూర్, హుజూర్‌నగర్, కోదాడ తదితర ప్రాంతాల్లో బస్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల నుండి సేకరించిన నిధులతో రూ.1 కోటి చెక్కు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రమాద బీమా పథకం కింద 11 కుటుంబాలకు ఒక్కోటి రూ.1 కోటి చొప్పున అందించినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల పనితీరు, లాభదాయక మార్గాలు, నష్టాల్లో ఉన్న రూట్లపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. కాలుష్య నియంత్రణ, ఈవీ విధానం విస్తరణపై దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన నేపథ్యంలో పెండింగ్ బకాయిలు తగ్గించామని, సంస్థ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# న్యాయమూర్తుల నియామకాల్లో మళ్లీ తెరపైకి స్థానికత అంశం

**హైకోర్టు వద్ద ధర్నా చేసిన తెలంగాణ న్యాయవాదులు**

**స్థానికేతరుల పేర్లను పరిశీలించవద్దని ఏకగ్రీవ తీర్మానం**

**తెలంగాణ మూలాలున్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్**

**సుప్రీంకోర్టు, కొలీజియంకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం**

**విభజన తర్వాత మళ్లీ ఉత్కంఠ రేపుతున్న అంశం**

**హైదరాబాద్, జూన్ 18 (కొత్త స్వరం):**

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో స్థానికత అంశం మరోసారి తెరపైకి వచ్చింది. హైకోర్టు జడ్జీల నియామకాల్లో స్థానిక న్యాయవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (THCAA) నిరసన చేపట్టింది. ఈ మేరకు బుధవారం హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. న్యాయమూర్తుల పోస్టుల కోసం స్థానికేతరుల పేర్లను పరిశీలించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. గత నెల 15న జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు న్యాయవాదులు తెలిపారు. తెలంగాణ మూలాలు ఉన్న వారినే న్యాయమూర్తులుగా నియమించాలని, భవిష్యత్ నియామకాలలో ఇతర రాష్ట్రాల పేర్లను పరిశీలించవద్దని సుప్రీంకోర్టు, హైకోర్టు కొలీజియంలను కోరాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి, గవర్నర్‌కు కూడా వినతిపత్రాలు సమర్పించాలని అసోసియేషన్ తెలిపింది. న్యాయమూర్తుల నియామక జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయవాదుల పేర్లు ఉన్నాయనే సమాచారం వెలువడటంతో ఈ నిరసన మరింత ఉధృతమైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత న్యాయవ్యవస్థలో ప్రాంతీయ ప్రాతినిధ్యం అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

# తీర ప్రాంతాల్లో హరిత వలయాలు

**'కోస్తా గ్రీన్ బెల్ట్'పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష**

**అమరావతి, జూన్ 18 (కొత్తస్వరం) :**

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల పర్యావరణ పరిరక్షణపై డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక దృష్టి సారించారు. కోస్తా ప్రాంతాల్లో హరిత వలయాలు విస్తరించేందుకు రూపొందిస్తున్న 'కోస్తా గ్రీన్ బెల్ట్' ప్రాజెక్ట్‌పై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో అటవీ, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తీర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి హరిత జోన్లు ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని పవన్ కల్యాణ్ సూచించారు. అలాగే తుపానుల ప్రభావాన్ని తగ్గించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ కోసం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కాకుండా స్థానిక ప్రజలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల పెంపకానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కోస్తా ప్రాంత అభివృద్ధిని పర్యావరణ రక్షణతో సమతుల్యం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

కర్నూలు - నంద్యాల

శుక్రవారం, జూన్ 19, 2026 పేజీ 3


## బీఎల్ఓ యాప్‌లో ఎన్యుమరేషన్ ఫారం నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

**స్వయంగా ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసిన కలెక్టర్**

**నమోదు ప్రక్రియపై క్షుణ్ణంగా పరిశీలన**

**లోపాలు లేకుండా డేటా నమోదు చేయాలని సూచన**

**కర్నూలు, జూన్ 18 (కొత్తస్వరం):**

బీఎల్ఓ యాప్‌లో ఎన్యుమరేషన్ ఫారం నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదు విధానాన్ని స్వయంగా పరిశీలిస్తూ, ఫారం పూరించే ప్రక్రియను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి నమోదు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలను పరిశీలించారు. డేటా నమోదు సమయంలో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమగ్రత పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, సమాచారం సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.



# గాజులపల్లిలో సహజ సిద్ధ వ్యవసాయ పద్ధతులపై కలెక్టర్ పరిశీలన







**కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మ్ పాండ్‌ను పరిశీలించిన కలెక్టర్**

**రైతులతో నేరుగా మాట్లాడి సాగు విధానాలపై ఆరా**

**అంతర పంటలు, ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యేక ఆసక్తి**

**మహానంది, జూన్ 18 (కొత్తస్వరం):**

ఈరోజు మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న సహజ సిద్ధ వ్యవసాయ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడి సాగు పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో రైతులు అనుసరిస్తున్న వివిధ వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, నీటి వినియోగ విధానాలపై కలెక్టర్ ఆరా తీశారు. ముఖ్యంగా ప్రకృతి అనుకూల సాగు విధానాలు రైతులకు ఎంత మేర ప్రయోజనం చేకూరుస్తున్నాయో తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ తోటల్లో సాగు చేస్తున్న అంతర పంటలు, వర్షాకాలానికి ముందస్తుగా పొడి నేలలో విత్తనాలు చల్లే సాగు విధానం ద్వారా చేపడుతున్న వ్యవసాయ పద్ధతులపై అధికారులు, రైతుల నుంచి సమాచారం సేకరించారు. ఈ విధానాలు నీటి సంరక్షణతో పాటు దిగుబడులను పెంచడంలో ఎంతవరకు దోహదపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు హుస్సేన్ రెడ్డి తన పొలంలో కలుపు నివారణ పరుపుల వినియోగంతో గులాబీ సాగు చేస్తున్న విధానాన్ని, అలాగే చుక్కల నీటి సరఫరా పద్ధతి ద్వారా బంతిపూల సాగును కలెక్టర్‌కు వివరించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేందుకు అవలంబిస్తున్న పద్ధతులను ఆయన వివరంగా తెలియజేశారు. రైతులు వినూత్న సాగు విధానాలను అవలంబించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొంటూ, వ్యవసాయంలో సాంకేతికతను మరింతగా వినియోగించి ఆదాయం పెంచుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

# కష్టమర్లు బిల్లు అడిగితే జీఎస్టీ అదనం అంటూ..

# భయపెడుతున్న వ్యాపారులు..!





**చిత్తుకాగితాలే ఆధారం.. వినియోగదారుల హక్కులకు తూట్లు**

**ఆటోమొబైల్ నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు ఒకే తంతు**

**చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగంపై విమర్శలు**

**ఆదోని, జూన్ 18 (కొత్త స్వరం ప్రతినిధి):**

పట్టణంలో వినియోగదారుల హక్కులు బహిరంగంగా ఉల్లంఘనకు గురవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటోమొబైల్ విడిభాగాల దుకాణాలు, మెకానిక్ షెడ్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయ కేంద్రాలు సహా పలు వ్యాపార సంస్థల్లో వినియోగదారులకు అసలు బిల్లులు ఇవ్వకుండా చిత్తుకాగితాలపై ధరలు రాసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టప్రకారం వస్తువులు విక్రయించిన ప్రతిసారీ వినియోగదారులకు బిల్లు ఇవ్వాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉన్నప్పటికీ, ఆ నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లు ఇవ్వకుండా లావాదేవీలు జరపడం వల్ల వినియోగదారులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. ప్రత్యేకంగా ఆటోమొబైల్ రంగంలో కొందరు మెకానిక్‌లు, విడిభాగాల దుకాణాల యజమానులు కుమ్మక్కై వాహన యజమానులకు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఏ విడిభాగం మార్చారు, ఎంత ధరకు విక్రయించారు అనే వివరాలు తెలిపే అధికారిక బిల్లు ఇవ్వకుండా చిన్న కాగితంపై మొత్తం రాసి పంపిస్తున్నారని వాపోతున్నారు. దీంతో వాహన యజమానులు మోసపోతున్నా ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోతోందని చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని వినియోగదారులు అంటున్నారు. ఫ్యాన్లు, మిక్సీలు, ఇన్వర్టర్లు, టీవీలు తదితర వస్తువులు కొనుగోలు చేసినప్పటికీ చాలాచోట్ల సరైన బిల్లు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. బిల్లు అడిగితే "జీఎస్టీ అదనంగా పడుతుంది", "అసలు బిల్లు కావాలంటే ఇంకొంత చెల్లించాలి" అంటూ వ్యాపారులు భయపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. వినియోగదారుల అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోందని అంటున్నారు. బిల్లు లేకపోవడంతో వస్తువులపై వారంటీ, గ్యారంటీ హక్కులు కూడా వినియోగదారులకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. కొద్ది రోజులకే వస్తువు పాడైతే బిల్లు చూపించాలని వ్యాపారులు చెప్పడం, బిల్లు లేక వినియోగదారులు నష్టపోవడం సాధారణమైందని చెబుతున్నారు. మరోవైపు అసలు ఉత్పత్తుల పేరుతో నాసిరకం వస్తువులను విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ వ్యవహారాలపై పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు స్పందించడం లేదనే విమర్శలు రావడం. వాణిజ్య పన్నులు, కొలతలు-తూనికలు, వినియోగదారుల పరిరక్షణ శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి బిల్లులు ఇవ్వని వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. తనిఖీలు లేకపోవడం వల్లే అక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని ఆరోపిస్తున్నారు. నాసిరకం విడిభాగాలు, ఎక్కడ తయారయ్యాయో తెలియని వస్తువులు కూడా ఎలాంటి బిల్లులు లేకుండా బహిరంగంగానే విక్రయిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. నెలవారీ మామూళ్లతోనే అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వస్తువు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి బిల్లు పొందడం చట్టబద్ధమైన హక్కు. అయినప్పటికీ బిల్లు అడిగిన వారినే తప్పు చేసినట్లుగా చూడడం దురదృష్టకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బిల్లులు ఇవ్వని వ్యాపార సంస్థలపై విస్తృత తనిఖీలు నిర్వహించి, వినియోగదారుల హక్కులను పరిరక్షించేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "వస్తువు కొంటే బిల్లు ఇవ్వడం వ్యాపారి బాధ్యత అయితే... బిల్లు అడిగితే అదనపు డబ్బులు ఎందుకు? చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు ఎప్పుడు మేల్కొంటారు?" అనే ప్రశ్నలు ప్రస్తుతం వినియోగదారుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి.



## భావి భారత పౌర నిర్మాతలు ఉపాధ్యాయులు: ఎన్. మురళీకృష్ణ

**నెరవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా అభినందన సభ**

**పదో తరగతిలో 100 శాతం ఫలితాలతో పాఠశాల ఘనత**

**19 మంది విద్యార్థులు ఐఐఐటికి ఎంపిక**




**పాణ్యం, జూన్ 18 (కొత్తస్వరం న్యూస్):**

భావి భారత పౌరులను తీర్చిదిద్దే అసలైన నిర్మాతలు ఉపాధ్యాయులేనని వాయిస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఎన్. మురళీకృష్ణ అన్నారు. పాణ్యం మండలంలోని నెరవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందన, సన్మాన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో నెరవాడ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. అలాగే 596/600 మార్కులతో మొదటి స్థానం సాధించడంతో పాటు 19 మంది విద్యార్థులు ఐఐఐటికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నంద్యాల వాయిస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర బ్యాంకు రిటైర్డు ఏజీఎం వై. సాయి సుధాకర్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ గోళ్ళ సుదర్శన్ శెట్టి, పదవీ విరమణ పొందిన ఇంజినీర్ డి. శ్రీనివాసులు, భూమిపుత్ర సీడ్స్ డీలర్ హరినాథ్, ప్రిన్సిపాల్ కోటయ్య, మండల విద్యాశాఖ అధికారి తదితరులు హాజరయ్యారు. విద్యార్థుల ఈ గణనీయమైన విజయానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేసిన కృషి అమోఘమని అతిథులు కొనియాడారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల జ్ఞానం మాత్రమే కాకుండా, ఉత్తమ పౌరులుగా ఎదిగే విలువలను బోధించే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. బీద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన కొనసాగిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పాండురంగారావు, ప్రిన్సిపాల్ కోటయ్య, మండల విద్యాశాఖ అధికారి మరియు 25 మంది సిబ్బందికి వాయిస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.

## 20న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు




**నందికొట్కూరు, జూన్ 18 (కొత్తస్వరం):**

ఈ నెల 20న నందికొట్కూరు బ్రహ్మంగారిమఠం ఫంక్షన్ హాల్‌లో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలు, భవిష్యత్ పోరాటాల కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


**పాత్రికేయులు కావలెను**

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్తస్వరం 9492813364

# కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
శుక్రవారం, జూన్ 19, 2026



## కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**అర్జీదారుల సమస్యలను నేరుగా తెలుసుకున్న కలెక్టర్**

**ఫోన్ ద్వారా ఫిర్యాదుల పురోగతిపై ఆరా**

**సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలపై దృష్టి**



**జిల్లా కేంద్రం, జూన్ 18 (కొత్తస్వరం):**
కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ అర్జీదారులతో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఫోన్‌లో నేరుగా మాట్లాడి వారి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాల పరిష్కార స్థితిపై ఆరా తీస్తూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, సమయానికి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అర్జీదారుడికి న్యాయం జరిగేలా పరిపాలన వ్యవస్థ పనిచేయాలని పేర్కొన్నారు.

## వైఎస్సార్సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

**బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎర్రమల సురేష్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిక**

**రూ. 50,000 ఆర్థిక సాయం అందించిన నేతలు**



**నందికొట్కూరు, జూన్ 18 (కొత్తస్వరం) :**
నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త ఎర్రమల సురేష్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన కాలు తీవ్రంగా దెబ్బతిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మరియు దారా సుధీర్ ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో సాయం అందించారు. చికిత్స ఖర్చుల కోసం రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. ప్రమాదంలో గాయపడిన సురేష్ త్వరగా కోలుకోవాలని నేతలు ఆకాంక్షించారు. కుటుంబానికి భరోసా ఇస్తూ అవసరమైన సమయంలో మరింత సహాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో నేతల మానవతా సహాయం పై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల భద్రతే లక్ష్యం

**సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన కార్యక్రమం**

**మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై విస్తృత అవగాహన**

**ఓటీపీలు, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచన**

**అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై ప్రజలకు అవగాహన**




**ఆలూరు, జూన్ 18 (కొత్తస్వరం):**
మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా కర్నూలు జిల్లా పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఆలూరు పట్టణంలోని కోట వీధిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆలూరు సీఐ శ్రీ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది కలిసి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, అలాగే అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌ను, సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించాలని ప్రజలకు వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



*కర్నూలు నగరం లోని ఎస్ ఏ పీ క్యాంపులో థిమాటిక్ యోగా లో భాగంగా శానిటేషన్ వర్కర్స్ తో యోగా కార్యక్రమంలో కలెక్టర్ డా.ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు.*

# విజిబుల్ పోలీసింగ్, ఏటీఎంల వద్ద ప్రత్యేక నిఘా








**ప్రజల భద్రత, నేర నియంత్రణ లక్ష్యంగా విస్తృత చర్యలు**

**సబ్ డివిజన్లలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు**

**ఏటీఎంల వద్ద రాత్రి వేళల్లో గట్టి నిఘా ఏర్పాటు**

**కర్నూలు, జూన్ 18 (కొత్తస్వరం) :**
జిల్లాలో ప్రజల భద్రతను పెంపొందించడం, నేరాలను నియంత్రించడం లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా పోలీసులు తెలిపారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రహదారి ప్రమాదాల నివారణకు "ఆపి, పరిశీలించి, ముందుకు సాగండి" అనే అవగాహన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని బ్యాంకు ఏటీఎం కేంద్రాల వద్ద రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఏటీఎం చోరీలు, సైబర్ మోసాలు వంటి నేరాలను అరికట్టేందుకు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ భద్రతా చర్యలను మరింత పటిష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు, ఘటనలు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–112 లేదా 100 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.



# జొన్నగిరి గోల్డ్ మైన్స్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష





**ఈ నెల 24న ముఖ్యమంత్రి జొన్నగిరి గోల్డ్ మైన్స్ సందర్శన**

**సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష**

**భద్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**కర్నూలు, జూన్ 18 (కొత్తస్వరం):**
ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి జొన్నగిరి గోల్డ్ మైన్స్ సందర్శించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు సమయానికి పూర్తి చేసి, అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.





## పీర్ల పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి**

**హోలగుంద పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం**

**సామరస్య వాతావరణంలో పండుగ నిర్వహించాలని సూచన**

**సైబర్ నేరాలు, మహిళలు–పిల్లల భద్రతపై అవగాహన**

**ఆలూరు, జూన్ 18 (కొత్తస్వరం):**
పీర్ల పండుగను శాంతియుత, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని ఆలూరు సీఐ శ్రీ రవిశంకర్ రెడ్డి ప్రజలకు సూచించారు. కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు హోలగుంద పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, హోలగుంద ఎస్సై శ్రీ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కోగిల తోట మరియు పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. పీర్ల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండుగను పరస్పర గౌరవం, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. అలయ్ ఆడే సమయంలో మారణాయుధాలు ఉపయోగించరాదని, మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల నివారణ, మహిళలు మరియు పిల్లల భద్రత, రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల సహకారంతోనే పండుగలను ప్రశాంతంగా నిర్వహించగలమని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరారు.

Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

https://kothaswaram.com

5 శుక్రవారం, జూన్ 19, 2026


## జులై 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

**అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్**

**వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం**

**పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారంపై దృష్టి**

**కర్నూలు, జూన్ 18 (కొత్తస్వరం):**
2026 జులై 11న అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా న్యాయ సేవా సదన్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మున్సిపల్, సచివాలయ, కెనరా లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్, భారత సంచార నిగమ్ అధికారులు పాల్గొన్న సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, భూ సేకరణ కేసులు, పన్ను సంబంధిత కేసులు, మున్సిపల్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ మార్గంలో పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఈ అవకాశంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కోర్టుల్లో ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని కక్షిదారులు తమ కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని అధికారులు కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ అధికారులు, బ్యాంకు అధికారులు, భూ సేకరణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

**హోంగార్డులకు ప్రమాద బీమాపై అవగాహన**

**ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచన**

**ఉత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు**





**నంద్యాల, జూన్ 18 (కొత్తస్వరం):**
క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ సూచించారు. నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో హోంగార్డుల పరేడ్, దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ హోంగార్డ్ కవాతును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్య భద్రత కోసం బీమా ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఆరోగ్య బీమా పథకాలు, వాటి ప్రయోజనాలపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో హోంగార్డులకు అవగాహన కల్పించారు. ప్రమాద బీమా సౌకర్యాలపై కూడా వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని, విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని కమాండెంట్ సూచించారు. సేవా భావంతో పనిచేసి పోలీసు శాఖకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ బి. చిన్ని కృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్, ఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినియోగంలో లేని వస్తువుల వేలం

**వేలంలో పాల్గొన్న 29 మంది ఔత్సాహికులు**

**రూ.4.50 లక్షలకు విక్రయమైన వినియోగంలో లేని వస్తువులు**

**పోటాపోటీగా సాగిన బహిరంగ వేలం**

**నంద్యాల, జూన్ 18 (కొత్తస్వరం):**
నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినియోగంలో లేని పలు వస్తువులకు నేడు బహిరంగ వేలం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కమిటీ, జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ బి. చిన్నికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. నంద్యాల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో, పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేలం ప్రక్రియ కొనసాగింది. వినియోగించదగని కంప్యూటర్లు, ముద్రణ యంత్రాలు, పత్రాల ప్రతుల యంత్రాలు, ట్యాబులు, విద్యుత్ జనరేటర్లు, నిరంతర విద్యుత్ సరఫరా పరికరాల బ్యాటరీలు మరియు ఇతర వస్తువులను వేలం వేశారు. ఈ వేలంపాటలో మొత్తం 29 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా, పోటాపోటీగా సాగిన వేలంలో వినియోగంలో లేని మొత్తం వస్తువులను రూ.4,50,000లకు అబ్దుల్ వాహబ్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. పారదర్శకంగా నిర్వహించిన ఈ వేలం ద్వారా వినియోగంలో లేని పరికరాలను సమర్థవంతంగా విక్రయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ బి. చిన్నికృష్ణతో పాటు ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు సూర్యమౌళి, సురేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్, జిల్లా పరిపాలన విభాగం అధికారులు వీరన్న, ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.



# రైతు మరణ ఘటనపై రాజకీయాలు చేయొద్దు: కాంగ్రెస్ నాయకులు

**రైతు మరణం బాధాకరమని ఆవేదన**

**వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు సరికాదని వ్యాఖ్య**

**మృత రైతు కుటుంబానికి అండగా ఉంటామని హామీ**




**ఇచ్చోడ, జూన్ 18 (కొత్త స్వరం):**
రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఇటీవల జరిగిన రైతు మరణ ఘటనను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు మాట్లాడుతూ, జొన్న కొనుగోలు కేంద్రంలో సంబంధిత రైతు పంటకు కాటా, లాట్ నంబర్ రసీదులు ఇప్పటికే జారీ చేసినట్లు తెలిపారు. రైతు జొన్నలను గోదాములకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ, పలుమార్లు సమాచారం అందించినా రైతు కొనుగోలు కేంద్రానికి రాలేదని వివరించారు. మార్కెట్‌కు వచ్చిన జొన్నలను వర్షానికి తడవకుండా కొనుగోలు చేసి గోదాములకు తరలించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతు మరణానికి గల అసలు కారణాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారని తెలిపారు. రైతు మరణం అత్యంత బాధాకరమని, ఈ ఘటనపై అందరూ తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఇలాంటి ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు. ఈ ఘటనను కొందరు రాజకీయ కోణంలో చూస్తూ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని, రైతుల సమస్యలపై నీతిమాలిన రాజకీయాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మృత రైతు కుటుంబానికి ప్రభుత్వం తరపున, పార్టీ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు కుటుంబానికి సంఘీభావం ప్రకటిస్తూ వారికి ధైర్యం చెప్పారు.



## భక్తిశ్రద్ధలతో మొహరం నిర్వహించుకోండి: ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి

**మహానంది, జూన్ 18 (కొత్తస్వరం న్యూస్) :**
మండలంలోని వివిధ గ్రామాల్లో మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి కోరారు. గురువారం బొల్లవరం సహా పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, మొహరం వేడుకల ప్రారంభం, ముగింపు సమయాలను పోలీసులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగంపై నిబంధనలు పాటించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శిల్పాకు షాక్..

## తెలుగుదేశం పార్టీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ, మైనార్టీ–దళిత నేతలు

## వైసీపీకి గట్టి దెబ్బ.. 150 కుటుంబాల పార్టీ మార్పు

## శిల్పా చక్రపాణి రెడ్డికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సవాల్

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని మైనార్టీ నేతల అభిప్రాయం

**ఆత్మకూరు, జూన్ 18 (కొత్తస్వరం):**
ఆత్మకూరు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇస్తూ ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షురాలు తిరుపాలమ్మతో పాటు మైనార్టీ, దళిత వర్గాలకు చెందిన పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వెంకటాపురం, కరివేన గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు పార్టీ మారడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆత్మకూరు పట్టణంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఛీదరించుకున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆ పార్టీ నేతలు ఇప్పటికీ తప్పుడు ప్రచారాలు, అహంకార ధోరణిని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల ముందే నేరుగా చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. అభివృద్ధి అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. శిల్పా చక్రపాణి రెడ్డి అహంకారపూరిత, దిగజారుడు రాజకీయాలపై విసుగు చెంది ఎంపీపీ తిరుపాలమ్మతో పాటు అనేక కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మైనార్టీ నేత నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ, జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వంతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ చేరికలతో ఆత్మకూరు నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.





# సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**51 మంది లబ్దిదారులకు రూ.30 లక్షల చెక్కుల పంపిణీ**

**పేదలకు సీఎం సహాయ నిధి వరమన్న ఎమ్మెల్యే**

**పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సాయం అందిస్తామని హామీ**

**ఆత్మకూరు, జూన్ 18 (కొత్తస్వరం):**
పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన అన్నారు. రెండేళ్ల పాలన – సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమం అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.30 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి అర్హుడికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఈ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి కుటుంబానికి అండగా నిలవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.